
సాక్షి బాపట్ల

శనివారం । 19 । ఆగస్టు । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 4,513 క్యూసెక్కులు విడుదల చేశారు.



పసుపు కొమ్ముల అలంకారం

పెదకాకాని : భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణమాసం మొదటి శుక్రవారం పురస్కరించుకొని అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించారు.

బండ్లమ్మ అమ్మవారికి పూజలు



పిట్టలవానిపాలెం: చందోలులోని బగళాముఖ బండ్లమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని మహాలక్ష్మిగా.. అభయ ప్రదాయినిగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు జరిపించారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరునికి రూ.32.53 లక్షల హుండీ ఆదాయం



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ లీలావతి సమక్షంలో 12 హుండీలను తెరచి అందులో ఉన్న నగదును భక్తులతో లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపీనాథ శర్మ మాట్లాడుతూ హుండీల ఆదాయం మొత్తం రూ. 30,88,133, అలాగే అన్నదాన మండపంలోని హుండీల ద్వారా రూ.1,64,953 వచ్చినట్లు తెలిపారు. అలాగే 206 గ్రాముల వెండి, 5 గ్రాముల 800 మిల్లీగ్రాముల బంగారం హుండీ ద్వారా భక్తులు అమరేశ్వరునికి సమర్పించినట్లు తెలిపారు. ఈ నగదు మొత్తాన్ని బ్యాంకులలో ఉన్న దేవాలయ ఖాతాలకు జమ చేస్తున్నామన్నారు.

నేడు సర్పంచ్, ఏడు వార్డుస్థానాలకు ఎన్నికలు

గుంటూరు వెస్ట్ : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వివిధ కారణాలతో ఖాళీ అయిన సర్పంచ్, ఏడుగురు వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల నిర్వహణ జిల్లా పంచాయతీ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. శనివారం జరగనున్న ఈ ఎన్నికల్లో తెనాలి మండలం బుర్రిపాలెం సర్పంచ్ పదవికి ఐదుగురు పోటీ చేస్తున్నారు. చేబ్రోలు మండలం గుండవరం, తోటిపాలెం, ప్రత్తిపాడు మండలం గొట్టిపాడు, పెదనందిపాడు మండలం అబ్బినేనిగుంట పాలెం, రావిపాడు, వరగానిలలో మొత్తం 7 వార్డు మెంబర్లకు 15 మంది పోటీ పడుతున్నారు. నేటి సాయంత్రానికి ఫలితాలు కూడా ప్రకటిస్తారు.

మల్లేశ్వరస్వామి దర్శనం



పెదకాకాని: భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయానికి దేవదాయ శాఖ రాష్ట్ర అదనపు కమిషనర్ టి.చంద్రకుమార్ దంపతులు విచ్చేశారు. వారికి సహాయ కమిషనర్ ఎస్.శ్రీనివాస్ రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అదనపు కమిషనర్ దంపతులు స్వామిని దర్శించుకుని అభిషేక పూజల్లో పాల్గొన్నారు. స్వామి శేషవస్త్రంతో ఆదనపు కమిషనర్‌ను సత్కరించారు. ఆలయ ప్రాంగణంలో చంద్రకుమార్ దంపతులు మొక్కలను నాటారు. కార్యక్రమంలో శాఖ ఉప కమిషనర్ ఈమని చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

వీఆర్‌లోకి 'ఆ ముగ్గురు'

సాక్షి ఎఫెక్ట్

తెనాలి: 'ఆ పోలీసుల తీరే వేరు' శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. సివిల్ పంచాయతీలో తలదూర్చటంతో సహా పనితీరుపైనా విమర్శలు రావడంతో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఏఎస్‌ఐ, కానిస్టేబుల్, త్రీటౌన్‌కు చెందిన మరో కానిస్టేబుల్‌పై ఉన్నతాధికారులు క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్టు సమాచారం. ఆ ముగ్గురిని వీఆర్‌లోకి పంపారు. ఆ ప్రకారం వారికి శుక్రవారం సాయంత్రం పాస్‌పోర్టునిచ్చి పంపినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

గుంటూరు డివిజన్ మీదుగా వెళ్లే పలు రైళ్లు రద్దు

లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు డివిజన్ మీదుగా పలు పనులు చేపట్టిన నేపథ్యంలో డివిజన్ మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేసినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైలు నంబర్ 17299.. గుంటూరు- విశాఖపట్నం శనివారం నుంచి 21 వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్టు తెలిపారు. విశాఖపట్నం-గుంటూరు(17240) ఈనెల 20 నుంచి 22 వరకు, గుంటూరు-నర్సాపూర్(17281) రైలు శనివారం నుంచి 21 వరకు, నర్సాపూర్-గుంటూరు(17282) శనివారం నుంచి 22 వరకు, గుంటూరు- డోన్(17228) రైలు శనివారం నుంచి 21వ తేదీ వరకు, డోన్- గుంటూరు(17227) మీదుగా ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు, నర్సాపూర్- గుంటూరు (07281) రైలును శనివారం నుంచి 21వ తేదీ వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్లు వెల్లడించారు.

వేళంగణికి ప్రత్యేక రైలు..

సికింద్రాబాద్- వేళంగణి(07161) ఈనెల 27, 29 తేదీలలో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైలు గుంటూరు డివిజన్ మీదుగా కేటాయించినట్లు తెలిపారు. వేళంగణి-సికింద్రాబాద్ (07162) రైలు ఈనెల 29, 31వ తేదీలలో ప్రత్యేక రైలును నడవనున్నట్టు వివరించారు.

నేడు పల్లెల్లో పోలింగ్

- రెండు సర్పంచ్ స్థానాలు, 35 వార్డుల్లో ఎన్నికలకు నోటిఫికేషన్
- ఇప్పటికే 24 వార్డులు ఏకగ్రీవం.. 11 వార్డుల్లో పోటీ అనివార్యం
- పోటీలో 28 మంది అభ్యర్థులు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారయంత్రాంగం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలో శనివారం పలు గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు జరగనున్నాయి. గత ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులు మృతిచెందడంతో ఖాళీగా మారిన స్థానాలకు ప్రభుత్వం తాజాగా ఎన్నికలు నిర్వహిస్తోంది. ఇంకొల్లు మండలం పావులూరు, చుండూరు మండలం మున్నంగివారిపాలెం సర్పంచ్ స్థానాలతోపాటు 11 మండలాల్లోని 12 పంచాయతీల పరిధిలో 35 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీచేసింది. దీంతో జిల్లాలో ఎన్నికల ప్రక్రియ మొదలైంది. చుండూరు మండలం మున్నంగివారిపాలెం పంచాయతీలో అధికారపార్టీ బలపరిచిన తిప్పిరెడ్డి మల్లేశ్వర రెడ్డి పోటీలో ఉండగా అమ్మిశెట్టి శ్రీరామమూర్తి టీడీపీ మద్దతుదారుగా బరిలో ఉన్నారు. ఇంకొల్లు మండలం పావులూరు పంచాయతీ సర్పంచ్ బరిలో వైఎస్సార్ సీపీ బలపరిచిన బొల్లేదు లూథియమ్మ, టీడీపీ మద్దతుదారు కొత్తపల్లి మహేష్‌బాబు, వేలూరు ఎలీషా పోటీలో ఉన్నారు. 35 వార్డుల్లో 24 వార్డులు ఏకగ్రీవం కావడంతో మిగిలిన 11 వార్డులకు 23 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. శనివారం దయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే పోలింగ్‌లో మొత్తం 7,829 మంది ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ జరగనుంది. కౌంటింగ్ అనంతరం ఎన్నికల ఫలితాలు ప్రకటించనున్నారు.



పోలింగ్ విధులపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

ఏర్పాట్లు పూర్తి

ఈ ఎన్నికల కోసం జిల్లా అధికారయంత్రాంగం అన్ని ఏర్పాట్లూ పూర్తిచేసింది. 33 పోలింగ్ కేంద్రాలు, 50 బ్యాలెట్ బాక్సులను సిద్ధంచేసింది. ఆర్వో-1, 2 లతో పాటు ఏఆర్వో, పీఓ, ఓపీఓ, జోనల్ ఆఫీసర్, రూట్ ఆఫీసర్లు, 19మంది కౌంటింగ్ స్టాఫ్, 15 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లను అధికారులు నియమించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 22 హైపర్ సెన్సిటివ్ పోలింగ్ స్టేషన్లను గుర్తించి అక్కడ అదనపు పోలీసు బలగాలను నియమించారు.



ఇంకొల్లు మండలంలోని పావులూరులో పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన బారికేట్లు

ప్రశాంతంగా ఎన్నికలు



జిల్లాలో రెండు సర్పంచ్‌లు, 11 వార్డు స్థానాలకు శనివారం ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లూ చేశాం. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిపేందుకు పటిష్టమైన చర్యలు తీసుకున్నాం. ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి.

– రంజిత్‌బాషా, కలెక్టర్, బాపట్ల జిల్లా

పటిష్ట భద్రతా చర్యలు



పంచాయతీ ఎన్నికల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాం. పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్ట బందోబస్తు ఏర్పాటుచేశాం. మూడు అత్యంత సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఆయా పోలింగ్ కేంద్రాల్లో డీఎస్పీ స్థాయి అధికారిని నియమించాం. ఎన్నికలు జరిగే గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పాతనేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంది.

– ఎస్పీ వకుల్‌జిందాల్, బాపట్లజిల్లా

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ప్రభుత్వ ఉద్యోగుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ పి.రంజిత్ బాషా చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమాన్ని బాపట్ల జిల్లాలో తొలిసారిగా ఆయన శుక్రవారం ప్రారంభించారు. తన చాంబర్‌లో 11 మంది ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలు సావధానంగా విని పరిష్కార మార్గం చూపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతినెలా మూడో శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడించారు. ఉద్యోగులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీ రెవెన్యూ అసోసియేషన్ కార్యాలయ భవనం కోసం స్థలం కేటాయించాలని, కలెక్టరేట్ ఉద్యోగుల కోసం క్యాంటిన్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్.సురేష్ బాబు, ప్రధానకార్యదర్శి బి.ఓంకార్, టౌన్ యూనిట్ అధ్యక్షులు ఎస్.కె.మహబూబ్ బాషా కోరారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి కె.లక్ష్మీశివజ్యోతి, కలెక్టరేట్ ఏ.ఓ కె.గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వారాబందీ విధానంలో సాగునీరు

జిల్లాలో వ్యవసాయానికి వారాబందీ విధానంలో సాగునీరు సరఫరా చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ జిల్లాలో రైతులు ఖరీఫ్ సాగు చేస్తున్నందున చివరి భూముల వరకు సాగునీరు అందించాలన్నారు. రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. సెప్టెంబర్ 10లోగా ఈ క్రాప్ నమోదు పూర్తి చేయాలన్నారు. పంట పొలాలకు సాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా కాలువల మరమ్మతులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదైన మండలాల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసుకునేలా రైతులను ప్రోత్సహించాలన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. అత్యంత సమస్యాత్మక బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించాలని అధికారులకు సూచించారు. అద్దంకి, మార్టూరు, ఏల్చూరు రాష్ట్ర రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని పోలీస్, ఆర్అండ్‌బీ సంయుక్తంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

రేపు ఏపీ స్టడీసర్కిల్ ప్రవేశ పరీక్ష

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ స్టడీ సర్కిల్‌లో ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ ప్రవేశ పరీక్ష ఈ నెల 20వ తేదీన జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష 20వ తేదీ ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు 3,282 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రవేశ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టిక్కెట్లను apstdc. apcfss వెబ్ సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకోవాలని, పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగా చేరుకోవాలని సూచించారు.

టీసీల కోసం ప్రదక్షిణ'లా'!

- ఏసీ లా కళాశాల చుట్టూ తిరిగిన విద్యార్థులు
- యాజమాన్యం వైఖరిపై కలెక్టర్‌కు ఫిర్యాదులు
- కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీఓ ప్రభాకర్‌రెడ్డి విచారణ
- వెంటనే టీసీలు జారీ చేసిన ప్రిన్సిపాల్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఆంధ్ర క్రైస్తవ (ఏసీ) లా కళాశాలలో ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన విద్యార్థులకు టీసీలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యాజమాన్యంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. విచారణకు ఆర్డీఓను ఆదేశించారు. దీంతో శుక్రవారం కళాశాలకు వచ్చి విచారణ జరిపించిన ఆర్డీఓ అక్కడికక్కడే విద్యార్థులకు టీసీలను జారీ చేయించారు.

అసలేం జరిగిందంటే..

ఏసీ లా కళాశాలలో ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన 300 మంది విద్యార్థులకు టీసీలు జారీ చేయాల్సి ఉంది. అయితే 16 మందికి మాత్రమే ఇచ్చారు. కళాశాలలో ప్రిన్సిపాల్ స్థానంపై ఇద్దరి మధ్య నెలకొన్న వివాదమే టీసీల జారీకి ప్రతిబంధకంగా మారింది. కళాశాల మేనేజ్‌మెంట్ బోర్డు ద్వారా అమృత వర్షిణి ప్రిన్సిపాల్‌గా నియమితులు కాగా, న్యాయస్థానం నుంచి ఆర్డర్ తెచ్చుకున్న గురవయ్య కూడా ప్రిన్సిపాల్ పోస్టులో సమాంతరంగా కొనసాగుతున్నారు. దీంతో కళాశాలలోని కార్యాలయ సిబ్బందికి టీసీలు జారీ చేసే విషయమై స్పష్టత కరువైంది. దీంతో విద్యార్థులు పూర్తి ఫీజు చెల్లించినా టీసీలు జారీ చేయలేదు. ఫలితంగా పలువురు విద్యార్థులు విషయాన్ని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించారు. దీంతో శుక్రవారం గుంటూరు ఆర్డీఓ ప్రభాకర్‌రెడ్డి కళాశాలకు వచ్చి గురవయ్య, అమృతవర్షిణితో వేర్వేరుగా మాట్లాడారు. అదే సమయంలో టీసీల కోసం పెద్ద సంఖ్యలో వచ్చిన విద్యార్థులతోనూ మాట్లాడారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ ప్రిన్సిపాల్‌గా ఎవరు కొనసాగుతారనేది తమకు అనవసరమని, టీసీలు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడం తగదని స్పష్టం చేశారు. అక్కడి నుంచే కళాశాల విద్య ఆర్జేడీ వీఆర్ జ్యోత్స్నకుమారితోపాటు ఏఎన్‌యూ రిజిస్ట్రార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఆర్డీఓ జోక్యంతో దిగివచ్చిన కళాశాల ప్రతినిధులు విద్యార్థులకు టీసీల జారీకి చర్యలు చేపట్టింది. ఆయన వెంట గుంటూరు తూర్పు తహసీల్దార్ నాగేష్ ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో ప్రభాకర్‌రెడ్డి

అనధికారిక వసూళ్లపై ఆర్డీఓకు ఫిర్యాదు

ఏసీ లా కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు బ్లేజర్ (కోటు) కొనుగోలు నిమిత్తం అనధికారికంగా డబ్బులు వసూలు చేశారని పలువురు విద్యార్థులు ఆర్డీఓ దృష్టికి తెచ్చారు. ఒక్కో విద్యార్థి నుంచి రూ.3,500 చొప్పున ఎటువంటి రశీదు లేకుండా వసూలు చేశారని, దీనిపై కళాశాల సిబ్బంది సమాధానం చెప్పడం లేదని వివరించారు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇస్తే చర్యలు చేపడతామని ఆర్డీఓ ప్రభాకర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు.

ఆశాజనకంగా ఫ్యామిలీ డాక్టర్ అమలు

- మరింత చురుగ్గా ముందుకు
- కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: సుస్థిర అభివృద్ధి సాధించాలంటే ముందుగా నిర్ణయించుకున్న లక్ష్యాలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాలులో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయానికి పెద్ద పీట వేస్తోందన్నారు. ముఖ్యంగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టి 10 నెలలు అవుతుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు కార్యక్రమం అమలు ఆశాజనకంగా ఉన్నా మరింత చురుగ్గా గ్రామాల్లోకి వెళ్లాలన్నారు. గ్రామాల్లో పర్యటించే సమయంలో స్థానికుల నుంచి వైద్యులు అభిప్రాయాలు సేకరించాలన్నారు. వైద్యం, మందుల పంపిణీ తదితర విషయాల్లో మరింత ప్రగతి సాధించాలన్నారు. చికిత్స చేసిన వెంటనే ఆ వివరాలను నమోదు చేయాలన్నారు. జిల్లా వైద్య శాఖాధికారి, నోడల్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. పీహెచ్‌సీలలో కాన్పుల సంఖ్య కొంత తగ్గిందని, వీలైనంత వరకు ప్రసవాలు చేపట్టాలన్నారు. గర్భిణులను ప్రైవేటు వైద్యశాలలకు పంపడం తగ్గించాలని చెప్పారు. రక్తహీనత ఉన్న విద్యార్థులకు, బాలింతలకు నిరంతరం వైద్య పరీక్షలు నిర్వహించి, అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్, సీపీఓ ఉషశ్రీ, ఐసీడీఎస్ మనోరంజని, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

దసరా నాటికి గృహ ప్రవేశాలు

- పసుమర్రు లేఅవుట్‌లో కనీసం 1,500 ఇళ్లు పూర్తి కావాలి
- జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి
- వెంటనే వసతులు సమకూర్చాలి
- సీఎం ఆశయాలు నెరవేర్చాల్సిన బాధ్యత అందరిదీ
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- గృహ నిర్మాణాలపై ఉన్నతాధికారులతో సమీక్ష



పసుమర్రు లేఅవుట్‌ను పరిశీలిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: జగనన్న కాలనీల్లో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇళ్లన్నీ దసరా నాటికి పూర్తి చేసి, గృహ ప్రవేశాలకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లకు సంబంధించి పూర్తి స్థాయి సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ముందుగా పసుమర్రు లేఅవుట్‌ను హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీశా, కలెక్టర్ లోతేటి శివశంకర్, ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం పురపాలక సంఘ కౌన్సిల్ హాలులో ఏర్పాటు చేసిన సమీక్షలో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని చెప్పారు. దసరా నాటికి పసుమర్రు లేఅవుట్‌లో 1,500 ఇళ్ల నిర్మాణం పూర్తికావాలని ఆదేశించారు. అన్ని లేఅవుట్లలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మంచినీటి వసతి, విద్యుత్, డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణాలు పూర్తి కావాలని సూచించారు.

ఇళ్లు లేని పేదలంటూ ఉండరాదు

నియోజకవర్గ పరిధిలో ఇళ్లు లేని పేదలంటూ ఉండటానికి వీల్లేదని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని పేర్కొన్నారు. సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి పూర్తి స్థాయిలో సహకరించాలని చెప్పారు. వారికి బిల్లులు వెంటనే మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పసుమర్రు లేఅవుట్‌కు అప్రోచ్ రోడ్డును అభివృద్ధి చేయాలన్నారు. ఇళ్లు మంజూరైనా నిర్మాణాలు మొదలు పెట్టని లబ్ధిదారులతో వెంటనే సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. వారితో మాట్లాడి వెంటనే ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టేలా ప్రోత్సహించాలని సూచించారు.



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని, పక్కన హౌసింగ్ ఎండీ లక్ష్మీశా, కలెక్టర్ శివశంకర్

అన్ని విధాలా అండగా..

హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీశా మాట్లాడుతూ లబ్ధిదారులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని చెప్పారు. బిల్లులు వెంటనే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. చిలకలూరిపేట అర్బన్ పరిధిలోని పసుమర్రు లేఅవుట్ రాష్ట్రంలోనే అతి పెద్ద లేఅవుట్లలో ఒకటని వెల్లడించారు. నియోజకవర్గంలోని లేఅవుట్లు మొత్తాన్ని మోడల్ కాలనీలుగా అభివృద్ధి చేస్తామని వివరించారు.

అప్రోచ్ రోడ్ల అభివృద్ధి

కలెక్టర్ లోతేటి శివశంకర్ మాట్లాడుతూ లేఅవుట్లకు అప్రోచ్ రోడ్లను వెంటనే అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ఎస్.వేణుగోపాలరావు, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి, హౌసింగ్ ఈఈ బి.శివలింగం, డీఈఈ ఎస్.వెంకట్రావు, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతుళ్లు మృతి

పిడుగురాళ్ల: నోట్ పుస్తకాల కొనుగోలుకు వెళ్లిన తండ్రీకూతుళ్లు ద్విచక్రవాహనంపై సంతోషంగా ఇంటికి తిరిగి వస్తుండగా ఆగి ఉన్న లారీ రూపంలో దారి కాచిన మృత్యువు కబళించింది. ఆ కుటుంబంలో తీరని విషాదం నింపింది. ఈ హృదయ విదారక ఘటన శుక్రవారం రాత్రి పిడుగురాళ్ల మండలంలోని బ్రాహ్మణపల్లి సమీపంలోని శ్రీనివాస్‌నగర్ వద్ద జరిగింది.

పోలీసుల కథనం ప్రకారం.. పట్టణ సమీపంలోని అయ్యప్పనగర్‌కు చెందిన యెనుముల నరసింహారావు(39)కు భార్య, నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. ఇటీవలే పెద్ద కుమార్తెకు పెళ్లిచేశాడు. రెండో కుమార్తె శ్రీనిధి (17) పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమెకు నోట్ పుస్తకాల కొనుగోలు కోసం శుక్రవారం సాయంత్రం బ్రాహ్మణపల్లికి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మార్గమధ్యలో శ్రీనివాస్‌నగర్ వద్ద రోడ్డు పక్కనే ఆగిఉన్న లారీని గమనించకుండా ఢీకొట్టారు. దీంతో నరసింహారావు, శ్రీనిధి తలలకు బలమైన గాయాలు కావటంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పట్టణ ఎస్‌ఐ పవన్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనాస్థలంలో మరణించిన యెనుముల నరసింహారావు, శ్రీనిధి

మార్గదర్శి బ్రాంచిల్లో రెండో రోజూ సీఐడీ తనిఖీలు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచ్ కార్యాలయాల్లో రెండో రోజు సీఐడీ విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని గుంటూరు అరండల్‌పేట, తెనాలి, పల్నాడు జిల్లా నరసరావుపేట, బాపట్ల, చీరాలలోని బ్రాంచి కార్యాలయాల్లో గురువారం ప్రభుత్వ శాఖలు సంయుక్తంగా సోదాలు చేపట్టిన విషయం విదితమే.. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి, గుంటూరు జిల్లాలోని తెనాలి బ్రాంచిల్లో సోదాలు నిర్వహించారు. ఈ రెండు బ్రాంచిల్లో చందదారుల వివరాలను సేకరించారు. పలు రికార్డులను నిశితంగా పరిశీలించారు.

క్లుప్తంగా

స్టేట్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్‌గా బాలవాలేశ్వరరావు



చావలి(వేమూరు): బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం చావలి గ్రామానికి చెందిన సోమరౌతు బాలవాలేశ్వరావు గ్రూప్–1కు ఎంపికయ్యాడు. వాలేశ్వరరావు గ్రూప్–2కు ఎంపికై గూడ్స్ సర్వీస్ ట్యాక్స్ అధికారిగా పని చేస్తున్నాడు. గురువారం విడువల చేసిన గ్రూప్–1 ఫలితాలలో స్టేట్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్‌లో ఎన్ఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. తర్వాత సివిల్, గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలకు సిద్ధమయ్యాడు. 2018లో గ్రూప్–2 ఉద్యోగం సాధించాడు. గ్రూప్–1 ఉద్యోగం సాధించాలనే ధ్యేయంగా చదివాడు. 2022లో గ్రూప్–1 నోటిఫికేషన్ విడదల చేశారు. గ్రూప్–1 పరీక్షల్లో మంచి మార్కులు సాధించడంతో స్టేట్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఎంపికయ్యాడు. తండ్రి సోమరౌతు విష్ణుమూర్తి జవహర్ నవోదయ విద్యాలయ పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. తల్లి కన్యకుమారి గృహిణి. బాలవాలేశ్వరరావును గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థులు మంచి నడవడిక కలిగి ఉండాలి

డీఎస్పీ వెంకటేశులు

బాపట్ల: విద్యార్థులు మంచి నడవడికతో భవిష్యత్‌లో ముందుకుపోవాలని డీఎస్పీ వెంకటేశులు పేర్కొన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాల్లో యాంటీ ర్యాగింగ్ వారోత్సవాల ముగింపు కార్యక్రమం శుక్రవారం స్థానిక కళాశాలో జరిగింది.

డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్ వంటి కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమలో కళాశాల డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు, ఎస్సై మహ్మద్‌రఫీ తదితరులు ఉన్నారు.

మెరుగైన సేవలు అందించేందుకే సచివాలయ వ్యవస్థ

ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు



హెల్త్ సెంటర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ మోపిదేవి

చెరుకుపల్లి: మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యానికి ప్రతిరూపాలైన సచివాలయయ వ్యవస్థను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన గొప్ప ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. మండల పరిధిలోని తూర్పుపాలెం గ్రామంలో రూ.40లక్షల వ్యయంతో నూతన సచివాలయ భవనం, రూ.17.5 లక్షలతో హెల్త్ సెంటర్, రూ.21.8 లక్షలతో రైతు భరోసా కేంద్రం, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన రూ.20లక్షలతో నాలుగు సీసీ రోడ్లు, మరో రూ.30 లక్షలతో సీసీ రోడ్డు, భవనాలను ఎంపీ మోపిదేవి మండల నాయకులతో కలసి శుక్రవారం ప్రారంభించారు. మోపిదేవి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కూడా రెండు కళ్లలా భావించి తన సుదీర్ఘ పాదయాత్రలో, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తూ అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందిన మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. గ్రామాల్లోని ప్రతి సమస్యను అదే గ్రామంలోనే పరిష్కరించేందుకే సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టారన్నారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రజలకు మరింత పారదర్శకమైన సేవలు అందించటమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. సచివాలయ వ్యవస్థతో పాటు గ్రామాల్లో ప్రజలకు మరింత సేవలు అందంచేందుకు వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి వారికి కేటాయించిన 50 ఇళ్లలో ఏ ఒక్క అవసరం ఉన్నా గ్రామ వలంటీర్ల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అదందుతున్నాయన్నారు. సచివాలయాలతోపాటు రైతులకు అన్ని విధాలుగా ఉపయోగకరంగా ఉండాలని ప్రతి గ్రామంలో ఒక ఆర్బీకే కేంద్రాన్ని నిర్మించి ఎరువు దగ్గర నుంచి రైతులకు అవసరం అయిన అన్ని సేవలు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటాయన్నారు. పల్లెలు ప్రగతి బాటలో పయనించాలనే ముఖ్య ఉద్దేశంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి అయిన ప్రతి గ్రామానికి గ్రాంలోని మౌలిక వసతులు కల్పించేందుకు రూ.20 లక్షలు నిధులతో 4 సీసీ రోడ్లు, మరో రూ.30 లక్షల నిధులతో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మర్రివాడ పావని, సర్పంచ్ తూము రమాదేవి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పైనం ఏడుకొండలరెడ్డి, తూము కోటేశ్వరరావు, చీరాల ప్రసాద్‌రెడ్డి, కామినేని కోటేశ్వరరావు, బండారు రామారావు, చెన్ను కోటేశ్వరరావు, కూరేటి శ్రీనివాసరావు, మొగలిపువ్వ కోటేశ్వరరావు రావూరి నాగేశ్వరరావు, తహసీల్దార్ కె.వెంకటేశ్వర్లు, పీఆర్ ఎఈ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే పోలీస్ గ్రీవెన్స్ ధ్యేయం

- ఎస్పీ వకుల్‌జిందాల్
- సమస్యలు విన్నవించుకున్న 92 మంది సిబ్బంది



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: పోలీస్ సమస్యల పరిష్కారమే పోలీస్ గ్రీవెన్స్ డే ధ్యేయమని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం జిల్లాలోని పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని 92 మంది సిబ్బంది పాల్గొని తమ సమస్యలను ఎస్పీకి వివరించారు. జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ నిత్యం ప్రజాసేవలో నిమగ్నమై ఉండే పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. సిబ్బంది వృత్తిపరమైన, ఆరోగ్యపరమైన, వ్యక్తిగతమైన పలు సమస్యలను పరిష్కరించటానికి కృషిచేస్తామన్నారు. ప్రజల ధన, మాన, ప్రాణాల రక్షణకై పాటుపడుతూ నిత్యం ప్రజా సేవలో నిమగ్నమై ఉండే పోలీస్ సిబ్బంది సమస్యలను తెలుసుకొని వాటిని సత్వరమే పరిష్కరించడానికి ప్రతి నెలలో ఒక రోజు గ్రీవెన్స్‌డే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. శాఖాపరమైన సమస్యలున్న పోలీస్ సిబ్బంది ప్రతి ఒక్కరూ పోలీస్ గ్రీవెన్స్‌డే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ ఎ.శ్రీనివాస్, డీపీవో ఏ సెక్షన్ సూపరింటెండెంట్ షేక్. కరీముల్లా కాలేషావలి పాల్గొన్నారు.

యార్డులో 32,393 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 29,858 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 32,393 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.11,500 నుంచి రూ.24,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,000 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 9,190 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు తెలిపారు.

'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమానికి ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం వార్షిక ప్రణాళికపై క్రీడాప్రాధికార సంస్థ, స్టెప్ అధికారులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని జిల్లాలో జయప్రదం చేయాలని కలెక్టర్ చెప్పారు. అక్టోబరు రెండు నుంచి 36 రోజులపాటు క్రీడా కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖో..ఖో, బ్యాడ్మింటన్, క్రికెట్ క్రీడలను గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయిలో జరపాలన్నారు. 17 సంవత్సరాలు దాటిన వారికి క్రీడల్లో అవకాశం ఉంటుందన్నారు. ముందస్తుగా క్రీడాప్రాంగణాలను ఎంపిక చేసి జాబితా పంపాలన్నారు. పురుషులు, స్త్రీలు ఎంపిక కార్యక్రమాలు పారదర్శకంగా చేపట్టాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో విజేతలకు ప్రథమ బహుమతి కింద రూ.50వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.30వేలు అందజేస్తామన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు. రాష్ట్ర స్థాయి ముగింపు కార్యక్రమం విశాఖపట్నం జిల్లాలో జరుగుతుందన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. సమావేశంలో స్టెప్ సీఈఓ ఎస్.పల్లవి, జిల్లా చీఫ్ కోచ్ కె.పాల్, వాలీబాల్ కోచ్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవినీతికి తావులేదు

డ్వామా పీడీ శంకర్‌నాయక్



కారంచేడులో ప్రజావేదికలో పాల్గొన్న పీడీ, ఎంపీపీ, అధికారులు

కారంచేడు: గ్రామాల్లో జరిగే మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో ఎక్కడా అవినీతికి తావులేదని బాపట్ల డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ వై శంకర్‌నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన కారంచేడు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల సామాజిక తనిఖీ ప్రజావేదికలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ ఏడాది మండలంలోని 14 గ్రామాల పరిధిలో సుమారు రూ.8.32 కోట్ల నిధులతో సుమారు 618 పనులు జరిగాయన్నారు. వీటిలో పంట కాలువల నిర్మాణం, పూడిక తీతలు, కట్టలమీద మొక్కల పెంపకం, డొంకరోడ్ల నిర్మాణం వంటి పనులు చేపట్టారన్నారు. వీటిలో గ్రామాల్లో జరిపిన సామాజిక తనిఖీలు, గ్రామసభల ద్వారా తనిఖీ సిబ్బందికి కొన్ని ప్రాంతాల్లో మస్టర్ రికార్డులు తప్పులు, కొట్టివేతలు గమనించామన్నారు. కొట్టివేతలుంటే ఏదో తప్పు చేసి వాటిని సరిదిద్దారనే విషయం తెలుస్తుందన్నారు. ఎక్కడా ఒక్క రూపాయి కూడా అవినీతి జరగడానికి వీలులేదన్నారు. ఒక వేళ అవినీతి, జరినట్లు రుజువైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రతి గ్రామం నుంచి నివేదికలు చదివి వినిపించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ శోభన్‌బాబు, అంబుడ్స్ పర్సన్ బీ రత్తయ్య, ఏపీడీ రాజేష్‌బాబు, ఎంపీడీవో డీ విజయలక్ష్మి, ఏపీవో ఎస్ ప్రదీప్‌కుమార్, సామాజిక తనిఖీ సిబ్బంది, ఉపాధి హామీ పథకం సిబ్బంది, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన వ్యక్తి ఆత్మహత్య



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై తిరుపతిరావు

జే.పంగులూరు: క్షణికావేశంలో భార్యను చంపి, తన బిడ్డలను దిక్కులేని వారిని చేశానని మనస్థాపంతో ఒక వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం రాత్రి బాపట్ల జిల్లా జే.పంగులూరు మండలంలోని రామకూరు గ్రామంలో జరిగింది. రేణింగవరం ఎస్సై కేకే తిరుపతిరావు తెలిపిన వివరాలు ప్రకారం. రామకూరు గ్రామానికి చెందిన పావులూరి లక్ష్మీనారాయణ (34) కుటుంబ కలహాల నేపథ్యంలో తన భార్య నాగసునీతను ఐదు నెలల కిందట గొంతు నులిమి హత్య చేశాడు. తన భార్యను చంపిన హత్య కేసులో సుమారు మూడు నెలలపాటు రిమాండ్‌లో ఉండి ఇటీవల బయటకు వచ్చాడు. పిల్లలను తన వద్ద ఉంచుకొని వలపర్లలో హెయిర్ స్టైల్ కటింగ్ షాపు నిర్వహించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. క్షణికావేశంలో తన భార్యను హత్యచేశానని, పిల్లలను చూసుకోవటం చాలా ఇబ్బందిగా ఉందని పలుమార్లు కుటుంబ సభ్యుల వద్ద ఆవేదన చెందినట్లు ఎస్సై తెలిపారు. క్షణికావేశంలో భార్యను చంపి పిల్లల ఆలనా పాలనా చూసుకోవటం బాగా ఇబ్బందిగా ఉండటం తోపాటు, పదేపదే భార్య గుర్తొస్తుండటంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. గురువారం తన ఇద్దరి కుమారులను బంధువుల వద్ద వదిలి పెట్టి ఇంటికి వచ్చాడు. గురువారం రాత్రి రామకూర్‌లోని తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి ఇంటిలో ఉన్న మృతుడు లక్ష్మీనారాయణ శుక్రవారం మధ్యాహ్నం కూడా ఇంటి తలుపు వేసి ఉండే సరికి అనుమానం వచ్చిన చుట్టుపక్కల వాళ్లు కిటికీలో నుంచి లోపలికి చేశారు. ఉరివేసుకొని మృతి చెందాడని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు లక్ష్మీనారాయణకు తొమ్మిది సంవత్సరాల అభిరామ్, ఏడు సంవత్సరాల విజయ్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎస్సై తిరుపతిరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలి

వేమూరు: దేవదాయ శాఖలో ఇనాం భూములు కలిగిన వంశ పారంపర్యం పనిచేస్తున్న అర్చకులు ప్రతి ఒక్కరూ వారి పేర్లు 43 రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని ఉమ్మడి గుంటూరు జిల్లా అర్చకుల సంఘం ప్రధానకార్యదర్శి, బాపట్ల అర్గనైజింగ్ సెక్రటరీ మేడూరు శ్రీనివాసమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ నాటికి దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. 43 రిజిస్టర్‌లో పేర్లు నమోదు కాని వంశ పార్యంపరం అర్చకులు జిల్లా సహాయ కమిషనర్‌కు దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. రిజిస్టర్‌లో పేర్లు నమోదైతే అర్చకులు వెల్ఫేర్ స్కీములోని ఉపయోగాలతోపాటు రైతు భరోసా కూడా వర్తిస్తుందని తెలిపారు. రెవెన్యూ రికార్డుల్లో అర్చకుల పేర్లు నమోదు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఐదు లక్షలలోపు ఆలయాల నిర్వహణ లాంటి ఫలితాలు కూడా వర్తిస్తాయని తెలిపారు. సహాయ కమిషనర్‌కు అర్జీ ఇచ్చిన వెంటనే 43 రిజిస్టర్‌లో పేర్లు నమోదుతోపాటు, అడంగల్‌లో చేర్చడం జరుగుతుందని తెలిపారు. అందువల్ల అర్చకులందరూ వెంటనే తమ పేర్లు 43 రిజిస్టర్‌లో నమోదు చేయించుకోవాలని తెలిపారు.

గ్రావెల్ తవ్వకాలను వ్యతిరేకించిన గ్రామస్తులు



తవ్వకాలకు వ్యతిరేకంగా చేతులెత్తి తమ అభిప్రాయాలను తెలుపుతున్న గ్రామస్తులు

మార్టూరు: తమ గ్రామంలో గ్రావెల్ తవ్వకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించేది లేదని మండలంలోని బొబ్బేపల్లి, రాజుగారిపాలెం గ్రామస్తులు జాయింట్ కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు తెలిపారు. రెవెన్యూ అధికారులు, రెండు గ్రామా ల ప్రజలు, ప్రజా ప్రతినిధులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కే రజనీష్‌రెడ్డి బొబ్బేపల్లి కొండ సర్వే నంబర్ 387/సీ11లో గ్రావెల్ త్రవ్వకాల కోసం అనుమతించాల్సిందిగా మైనింగ్, పర్యావరణ అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ క్రమంలో జేసీ, ఆర్డీఓ గంధం రవీందర్‌లు శుక్రవారం స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి గ్రామంలో చాటింపు వేయించి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. సమావేశానికి హాజరైన గ్రామస్తులతో జేసీ శ్రీధర్ మాట్లాడుతూ కొండపై గ్రావెల్ తవ్వకాలను వ్యతిరేకించే వారు చేతులు ఎత్తడం ద్వారా తమ అభిప్రాయాలను తెలుపమని కోరారు. ప్రజలంతా చేతులెత్తి తమ వ్యతిరేకతను తెలియజేశారు. గ్రావెల్ తవ్వకాలకు అనుకూలురు ఉంటే తమ ఆమోదం తెలుపమని జేసీ అడుగగా ఒక్కరు కూడా చేతులెత్తక పోవడం గమనార్హం. ఈ క్రమంలో జేసీ మాట్లాడుతూ ప్రజాభిప్రాయాన్ని రికార్డు చేశామని నివేదికను ఉన్నతాధికారులకు, పర్యావరణ పరిరక్షణ అధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్‌బాబు, ఆర్ఐ బాషా పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన సీఐలకు పోస్టింగ్‌లు

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): గుంటూరు రేంజ్‌లో కొద్ది రోజుల కిందట పలువురు ఎస్ఐలు సీఐలుగా ఉద్యోగోన్నతి పొందిన విషయం విదితమే. ఈ క్రమంలో ఉద్యోగోన్నతి పొందిన సీఐలకు పోస్టింగ్‌లు కల్పిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ జి.పాల్‌రాజు ఉత్తర్వులు జారీచేశారు.

మత్తు పదార్థాలు తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

నిందితుడు గుంటూరు జిల్లా వాసిగా గుర్తింపు



మార్టూరు పోలీసులు స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థం

మార్టూరు: మత్తు పదార్థాలను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని మార్టూరు పోలీసు అధికారులు అరెస్టు చేశారు. సీఐ ఫిరోజ్ తెలిపిన వివరాల మేరకు.. గురువారం ఉదయం బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ, ఎస్సై కమలాకర్‌ల బృందం బెంగళూరు నుంచి గుంటూరు వెళుతున్న ఆరెంజ్ ట్రావెల్స్ బస్సులోని ఓ ప్రయాణికుడిని అనుమానంతో అదుపులోనికి తీసుకొని విచారించారు. విచారణలో భాగంగా ఆ వ్యక్తి గుంటూరు సమీపంలోని రెడ్డిపాలెం గ్రామానికి చెందిన షేక్ నిజాముద్దీన్‌గా గుర్తించి అతని నుంచి 8 గ్రాముల మెథాఫిటామిన్ మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గతంలో బెంగళూరులో పని చేస్తూ అక్కడి బ్రిగేడ్ రోడ్‌లోని ఓ పబ్‌లో మత్తు పదార్థాలకు బానిసయ్యాడు. తరచూ అక్కడి నుంచి నాని అనే వ్యక్తి నుంచి మత్తు పదార్థాలు కొనుగోలు చేస్తున్నట్లు నిందితుడు తెలిపాడు. స్వాధీనం చేసుకున్న 8 గ్రాముల మత్తు పదార్థాన్ని నాని నుంచి నిజాముద్దీన్ గ్రాము 1కి రూ.2 వేలు చొప్పున రూ.16 వేలకు కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఈ క్రమంలో నిజాముద్దీన్ నుంచి 8 గ్రాముల మత్తు పదార్థంతోపాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అధికారులకు ఎస్పీ రివార్డు

మత్తు పదార్థాల అక్రమ రవాణాను పసిగట్టి నిందితుడిని చాకచక్యంగా అరెస్టు చేసిన మార్టూరు సీఐ, ఎస్సై కమలాకర్, ఏఎస్ఐలు సైదా, మహబూబ్ బాషా, కానిస్టేబుళ్లు సుబ్బారావు, ప్రసాద్‌లకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించారని సీఐ తెలిపారు.

అంతర సాగుతో ఖర్చులు తక్కువ

- ప్రకృతి వ్యవసాయ విభాగం పల్నాడుజిల్లా డీపీఎం కె అమలకుమారి
- ఉన్నవ గ్రామంలోని ప్రకృతిసాగు పంటల పరిశీలన
- రైతులకు పలు సలహాలు, సూచన్లు చేసిన అధికారులు



ఉన్నవలో ప్రకృతి విధానంతో సాగైన పంటను పరిశీలిస్తున్న అధికారులు

యడ్లపాడు: అంతర పంటల సాగుతో ఖర్చులు తగ్గి..ఎర పంటలతో ఆయా పంటలకు చీడపీడల నుంచి రక్షణ ఉంటుందని ప్రకృతి వ్యవసాయం పల్నాడు జిల్లా డీపీఎం కె అమలకుమారి తెలిపారు. మండలంలోని ఉన్నవ గ్రామంలో ప్రకృతి విధానంతో సాగు చేసిన వివిధ పంటల్ని శుక్రవారం ఆమె సందర్శించారు. స్థానిక రైతుల్ని ఆయా పంటల సాగు, చీడపీడ నివారణ, యాజమాన్య పద్ధతులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులకు అంతర పంటల సాగు, ఎరపంటల ఆవశ్యకతపై పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో రాజీలేని సూత్రాలు తప్పకుండా ఆచరించాలన్నారు. ప్రతి పంటలో అంతర పంటగా ఆరు వరుసలకు ఒక వరుస కంది వేసుకోవాలని సూచించారు. నాటిన 45 రోజులకు సొర బీర వంటి తీగ జాతి కూరగాయ విత్తనాలను సాళ్లలో నాటుకోవాలన్నారు. సరిహద్దు పంటలుగా సజ్జ జొన్న మొక్కజొన్న వంటి పంటలు పొలం చుట్టూ నాలుగు వరుసలో నాటుకుంటే మేలన్నారు. ఎర పంటగా ఏడు ఆముదం మొక్కలు, 400 బంతి మొక్కలు ఎకరా పొలంలో నాటుకోవాల్సి ఉంటుందని వివరించారు. అంతర పంటలు ఎరపంటలు సరిహద్దు పంటలు వేసుకోవడం ద్వారా మిత్ర పురుగులు ఆకర్షించి శత్రు పురుగుల వ్యాప్తిని తగ్గించేందుకు దోహదపడతాయన్నారు. అంతర పంటలతో రైతుకు మంచి ఆదాయం కూడా లభిస్తుందన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు

పత్తి విత్తన పది రోజుల తర్వాత ఎకరా పొలంలో 30 నుంచి 40 వరకు పసుపు, తెలుపు, నీలంరంగు జిగురు పూసిన అట్టలు పొలాల్లో ఏర్పాటు చేసుకుంటే రసంపీల్చే పురుగుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. నాటిన 20–30 రోజులకు ఎకరాకు 8 చొప్పున లింగాకర్షక బుట్టల్ని పెట్టుకోవాలని దీంతో గులాబీ రంగు పురుగు ఉనికిని గమనించి నివారణ చర్యలు పొందే వీలుందన్నారు. 25 రోజుల నుంచి 30 రోజుల వ్యవధిలో ఐదుసార్లు ద్రవ జీవామృతం పారించాలని తెలిపారు. ఇలా రసాయన ఎరువుల వినియోగానికి చెక్ పెట్టి నాణ్యమైన పంట ఉత్పత్తుల్ని సాధించుకోవచ్చని అవగాహన కల్పించారు.

గుంటూరు జిల్లాలో 31.3 మి.మీ సగటు వర్షపాతం

కొరిటిపాడు (గుంటూరు): గుంటూరు జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు అత్యధికంగా ప్రత్తిపాడు మండలంలో 74.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా తుళ్లూరు మండలంలో 1.2 మి.మీ వర్షం పడింది. సగటున 31.3 మి.మీ వర్షపాతం నమోదైంది. వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. తాడికొండ 70.2, చేబ్రోలు 60.2, తెనాలి 44.4, గుంటూరు పశ్చిమ 42.4, గుంటూరు తూర్పు 40.2, దుగ్గిరాల 38.6, పొన్నూరు 38.6, పెదకాకాని 38, కొల్లిపర 33.4, మేడికొండూరు 33, కాకుమాను 13.8 మి.మీటర్ల వర్షం కురిసింది.